క్లుప్తంగా

క్రీడాపోటీల్లో పాల్గొనండి

స్టేషన్ మహబూబ్‌నగర్: అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చేనెల 1 నుంచి 3 వరకు నెహ్రూ యువజన కేంద్రం ఆవరణలో మహిళలు, పాఠశాల, కళాశాలస్థాయి బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, పరుగు, స్కిప్పింగ్, షటిల్, క్యారంబోర్డు, చెస్‌తోపాటు పాటలు, నృత్యాల, మేకప్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగలవారు 6302908528, 9705313061 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలి

నవాబుపేట: పాఠశాలలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందించి వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిసింగ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. పాఠశాలలకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు తీసుకువచ్చి వాటిని బలోపేతం చేయాలన్నారు. పాఠశాలలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలకు సైన్స్‌ఫేర్‌లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. దీంతో పాటు ఉపాధ్యాయుల ప్రమోషన్ల విషయంలో టెట్ నిబంధనను తొలగించాలని కోరారు.

తెలుగు పండితుడికి ఘన సన్మానం



కోయిల్‌కొండ: మండల కేంద్రానికి చెందిన తెలుగుపండితుడు జోషి మధుసూదనశర్మను కరీంనగర్‌లో జరిగిన కవిసమ్మేళనంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆయన రాసిన రుబాయిలు శతకము, మధురసుధలు పుస్తకాల ఆవిష్కరణతోపాటు... మహతీ సాహితీ కవి సంగమంలో భాగంగా సాహితీ చక్రవర్తి బిరుదుతో సత్కరించారు. మధుసూదన శర్మ మండలంలోని వింజామూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



అడ్డాకుల: మండలంలోని రాచాలలో లక్ష్మీచెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బోయపల్లి దేవమ్మ, వెంకటయ్య, వారి కుమారుడు బాలయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. శనివారం మొదలైన పోటీలు ఆదివారం కూడా కొనసాగాయి. మొత్తం 34 జట్లు పాల్గొంటున్న పోటీలు సోమవారం సాయంత్రం ముగియనున్నాయి.

మైసమ్మ చెంత జనజాతర



నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం చెంత భక్తజన జాతర కొనసాగింది. ఆదివారం పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాల మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మైసమ్మ అడవి మొత్తం భక్తులతో నిండి పోయింది.

హక్కుల కోసం పోరాటం

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్మికుల సంక్షేమానికి ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర నాయకులు విజయ్‌బాబు, డి.శ్రీనివాసులు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బీఎస్.జయపాల్, ప్రమోద్‌కుమార్, జీవరాజు, ఆటో యూనియన్ నాయకులు బాబుమియా, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

జడ్చర్ల: మండల పరిధిలోని కిష్టంపల్లి సమీపంలో మల్లలమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తమ బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, వడిబియ్యం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 16 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నిర్మించారు..వదిలేశారు

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- రూ.లక్షలు వృథాగా మారిన వైనం
- కానరాని సేంద్రియ ఎరువుల తయారీ



ఖాళీగా సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం



మిడ్జిల్‌లో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్

మిడ్జిల్: మండల పరిధిలోని పలుగ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో రూ. లక్షల్లో ప్రజాధనం వృథా అయ్యిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయడం కోసం ప్రభుత్వం ప్రతి పంచాయతీ పరిధిలో సుమారు రూ.1.60 లక్షలతో ఈ షెడ్లను నిర్మింపజేసింది. కాగా అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తదితర కారణాలతో వీటిని వృథాగా వదిలేశారు. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్స్ నిర్మించారు. నిత్యం గ్రామాల నుంచి తడి చెత్త, పొడిచెత్త తీసుకువచ్చి ఇక్కడ వేరు చేయాల్సి ఉంటుంది. అందులో ఆహార సంబంధ వ్యర్థాలు, తదితరాలను సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాల్సి ఉంటుంది. ఈ ఎరువును పల్లె ప్రకృతి వనాలకు, గానీ, హరితహారంలో రోడ్ల వెంట నాటిన మొక్కలకు గానీ వేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో కొందరి నిర్లక్ష్యం నీరుగారుస్తోంది. మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా లక్ష్యం వైపు అడుగులు పడలేదు. చెత్తను సేకరించినా వేరు చేయకుండా దహనం చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇక ప్రజాప్రతినిధుల సంగతి సరేసరి. కనీసం షెడ్ల వంక కన్నెత్తైన చూడలేదు. ప్రస్తుతం ప్రత్యేకాధికారులైనా షెడ్లను వినియోగం లోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. విషయంపై ఎంపీఓ అనురాధను వివరణ కోరగా, కొన్ని గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేయడం లేనందున సేంద్రియ ఎరువులు తయారు కావడం లేదన్నారు. వానపాములు కూడా అందుబాటులో లేవని తెలిపారు.



వేరు చేయకుండా చెత్త దహనం

రామకృష్ణ పరమహంస జయంతి

జడ్చర్ల: స్థానిక అనురాగిణి ఆశ్రమంలో ఆదివారం రామకృష్ణ పరమ హంస జయంతిని సంస్కార భారతి ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆయన చూపిన ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యులు రాధాక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న చిన్నారులు

పాలిటెక్నిక్ విద్యార్థిని అదృశ్యం

జడ్చర్ల: మండలపరిధిలోని బోయలకుంటకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని రాసోల్ల శ్రుతి(19) ఈనెల 14 నుంచి కనిపించకుండా పోయిందని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం చదువుతున్న శ్రుతి ఈనెల 14న ఆరోగ్యం బాగాలేదన్నకారణంగా ఇంటికి వచ్చిందన్నారు. తదుపరి అదేరోజు ఆస్పత్రికి వెళ్లి వస్తానంటూ బయటకు వచ్చిందన్నారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం దక్కలేదన్నారు. దీంతో ఆమె తండ్రి శివశంకర్ ఆదివారం తమకు ఫిర్యాదు చేశారని.. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కనుల పండువగా శకటోత్సవం



ఆలయం చుట్టు తిరుగుతున్న ఎద్దుల బండ్లు

అడ్డాకుల: మండల పరిధిలోని రాచాల గ్రామంలో వెలిసిన చెన్నకేశవస్వామి జాతరను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఆలయం వద్ద శకటోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు దాసంగాలను పెట్టి స్వామి వారికి సమర్పించారు. సోమవారం సాయంత్రం ఆలయం వద్ద ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్త గవిని చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ పాశం తిరుపతయ్య, చక్రధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, జగన్నాథం, రాఘవరెడ్డి, రాము, రంజిత్‌కుమార్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాల ల్లో ఎస్సెస్సీ విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టును వాగ్దేవీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, భయాన్ని పోగొట్టే విధంగా పరీక్షను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు మొత్తం 3,200 మంది విద్యార్థులు హాజరయ్యారని, పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు, మూడో బహుమతి రూ.3వేలు ఇస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, నందు, ఈశ్వర్, శ్రీనాథ్, రాధిక, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



టాలెంట్ టెస్టు రాస్తున్న విద్యార్థులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



సంగాయపల్లి శివాంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

మహమ్మదాబాద్: పల్లెల్లో భక్తిభావాన్ని పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిపారు. మండల పరిధిలోని సంగాయపల్లి తండాలో ఏర్పాటు చేసిన శివాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా ఇలాంటి ఆలయాలు ఏర్పాటు చేయడంతో ప్రజల్లో భక్తిభావం పెరిగిపోతుందని తెలిపారు. అందుకు తనవంతు సమాయసహకారాలు ఉంటాయని తెలిపారు. విగ్రహప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించిన ఆమెకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతీబాయి, ఎంపీటీసీ వేణుగౌడ్, లక్ష్మణ్, సుధాకర్, శ్రీను, భాను, చెందర్, సత్రు, దేవిబాయి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రిస్టియన్‌కాలనీలోని ఎంబీ ప్రార్థనా మందిరం స్త్రీల సమాజం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఏడాది వరకు కొనసాగే నూతన కమిటీలో చైర్ పర్సన్‌గా రత్నమ్మ, వైస్ చైర్ పర్సన్‌గా ఎస్తేరు, కార్యదర్శిగా విజయ, కోశాధికారులుగా సరోజమ్మ, మంజుల, ఎల్డర్స్‌గా ఎంఎల్స్య, సునీత ఎన్నికయ్యారు. అనంతరం పాస్టర్ విల్సన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



క్రీడలతో మానసికోల్లాసం

దేవరకద్ర రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్రలో డీపీఎల్–3 క్రికెట్ లీగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి, తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. అనంతరం 16 జట్లకు సంబంధించిన క్రీడాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీకాంత్ యాదవ్, నరేందర్ రెడ్డి, కొండారెడ్డి, కర్ణంరాజు, జహంగీర్ పాషా, దొబ్బలి అంజి, చల్మారెడ్డి, యుగేంధర్ రెడ్డి, రాధాకృష్ణ, నిర్వాహకులు యాదయ్య, నాగరాజు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



కీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

ఆదర్శప్రాయుడు కర్పూరి ఠాకూర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్ నాయీ బ్రాహ్మణ ఆణిముత్యమని..ఆదర్శ ప్రాయుడని తెలంగాణ నాయిబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలరాజు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. కేంద్రం భారతరత్న ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం కర్పూరి ఠాకూర్ చిత్రపటంతో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు రాములు, కార్యనిర్వహక కార్యదర్శి రఘు, నాయకులు బస్వరాజు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కరాటేలో విద్యార్థులు రాణించాలి



బెల్టులు పొందిన విద్యార్థులతో ప్రముఖులు, షోటోకాన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు గంజి ఆంజనేయులు, డాక్టర్ రాఘవేంద్రకుమార్ అన్నారు. అప్పన్నపల్లిలో ఆదివారం జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను అభినందించారు. జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ ఫౌండర్ జి.క్రిష్ణయ్య, చైర్మన్ రవికుమార్ పరీక్షలను పర్యవేక్షించారు.

పంచాయతీ భవనాలు పూర్తయ్యేనా?



నిర్మాణదశలోనే ధర్మాపూర్ పంచాయతీ భవనం



పెద్దతండాలో రేకులగదిలో..

మహమ్మదాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం ఎప్పటికీ పూర్తవుతుందోనని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఐదు సంవత్సరాల తరువాత కొత్త గ్రామ పంచాయతీలు, కొత్త వ్యక్తులకు సర్పంచ్ పదవులు, అన్ని హంగులతో సౌకర్యాలతో కూడిన కొత్త భవనాలు కూడా ఉంటాయని ఎంతో సంతోషపడ్డా చాలా గ్రామాలకు కొత్త భవనాలే లేకుండా పోవడం గమనార్హం. దీంతో ఆయా గ్రామాలకు ఇటీవలి వరకు సర్పంచ్‌లుగా వ్యవహరించిన వారిలో కొందరు కొందరు ఇరుకుగదుల్లో పాలనసాగిస్తే.. మరికొందరు రేకుల గదుల్లో, వంటగదుల్లో పంచాయతీ భవనాలను పెట్టుకుని సర్దుకుపోయారు. గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో మొత్తం 59 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 18 పాత భవనాలు ఉన్నాయి. కాగా మరో 31 కొత్త భవనాలకు నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారు. వాటిలో 4 మాత్రమే పూర్తయ్యాయి. మరో 19 భవనాలు వివిధ దశల్లో ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. 8 గ్రామాల్లో ఇంకా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల ఊసేలేదు. చాలా సందర్భాల్లో ఉన్నతాధికారులు వచ్చినా సమావేశాలకు తావులేక ఎన్నో అవస్థలు ఎదుర్కొన్న పరిస్థితి తలెత్తింది.

నిర్మాణాలు జరుగుతున్నాయి

రెండు మండలాల్లో కొన్ని పంచాయతీ భవనాలు టెండర్ల ద్వారా మరికొన్ని రూర్బన్ పథకం కింద మరికొన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మాణాలు చేపడుతున్నాం. చివరి దశలో ఉన్న భవనాల నిర్మాణాలు వెంటనే పూర్తి చేసి ప్రారంభిస్తాం.

– దేవన్న, ఎంపీడీఓ

అంగన్‌వాడీలో కొనసాగించాం

కొత్త గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు బాధ్యతలు స్వీకరించి.. ఎంతో మంచి పాలన అందించవచ్చని సంతోషపడ్డాం. కానీ సరిపడా పంచాయతీ భవనం కూడా లేకుండ అవస్థలు ఎదుర్కొన్నాం. అంగన్‌వాడీలో ఓవైపు పిల్లలు మరోవైపు పాలకమండలి ఇరుకు గదిలో పంచాయతీ ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు పడ్డాం. ఇప్పటికైనా పూర్తిచేయాలి.

– రాజు నాయక్, పంచలింగాల్ తండా మాజీ సర్పంచ్

అవస్థలు ఎదుర్కొన్నాం

మాది మారుమూల గిరిజన తండా. కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. దీంతో నేను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. త్వరలో భవనం నిర్మించుకుని ఆదర్శవంతంగా పరిపాలన చేద్దామనుకున్నాం. కానీ ప్రభుత్వం నిర్ణయాలతో అవస్థలు పడ్డాం. పంచాయతీ భవనం లేక పాఠశాలలోని ఓగదిలో ఏర్పాటు చేసుకుని పాలన సాగించాం.

– రమేష్, మాజీ సర్పంచ్, ఆముదాలగడ్డతండా

కంకర రోడ్డుతో ఇబ్బందులు

నర్వ: మండలంలోని ప్రధాన రహదారి మక్తల్, గద్వాల్ అసంపూర్తి రహదారి పనులను ఎప్పుడు చేపడుతారని ప్రయాణికులు వాపోతున్నారు. గత ఏడాది క్రితం ప్రారంభించిన బీటీరోడ్డు పనులు కంకర వరకే పరమితం కావడంతో సత్యావార్ నుంచి మిట్టనందిమల్ల వరకు వాహనాల రాకపోకలతో ఒక్కటే దుమ్ము ప్రయాణికుల కళ్లలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా ఇటు గద్వాల్, అటు మక్తల్‌కు వెళ్లే అనేక వాహనాలు, ప్రయాణించలేక అవస్థలు పడుతున్నారు. ఈ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. .



అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అడ్డాకుల: మండలంలోని రాచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో పదో తరగతి మొదలైనప్పటి నుంచి గతేడాది వరకు పాఠశాలలో పదో తరగతి చదివిన వారు సమ్మేళనానికి హాజరయ్యారు. గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న వారందరూ గ్రామానికి వచ్చారు. నాటి నుంచి చదువులు చెప్పిన గురువులను పాఠశాలకు ఆహ్వానించారు. పాఠశాలలో జరిగిన సమావేశంలో నాటి గురువులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆనాటి రోజులను అనుభవాలను పంచుకొన్నారు. ఆనందంగా గడిపారు. అనంతరం వారిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వవిద్యార్థులు సమావేశంలో మాట్లాడారు. తాము చదువుకున్న పాఠశాలకు సహకారం అందించాలని నిర్ణయించారు.